క్లుప్తంగా

ఘనంగా భగవాన్ రమణ మహర్షి జయంతి



లక్ష పుష్పార్చన చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడురోడ్డులోని శ్రీ రమణ మహర్షి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో గురువారం భగవాన్ రమణ మహర్షి 144వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా లక్షపుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదం చేశారు. ప్రధానోపాధ్యాయులు రవిప్రకాష్, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుణ్ జైట్లీకి నివాళి



అరుణ్ జైట్లీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్ర రావు ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత అరుణ్ జైట్లీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అరుణ్ జైట్లీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ గౌరీశంకర్, పట్టణ ఇన్చార్జి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు శివకళ్యాణి పాల్గొన్నారు.

జ్యోతి సర్వీసులతో ఆర్టీసీకి ఆదాయం

మైదుకూరు : జిల్లాలోని ప్రముఖ క్షేత్రమైన జ్యోతిలోని కాశినాయన ఆరాధన ఉత్సవాల సందర్భంగా బస్సు సర్వీసులను నడపడం వల్ల మైదుకూరు ఆర్టీసీ డిపోకు రూ.5.54 లక్షల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 26, 27 తేదీల్లో మైదుకూరు - జ్యోతికి 11 బస్సులు, పోరుమామిళ్ల -జ్యోతికి 7 బస్సులు, బి.మఠం -ఙ్యోతికి 2 బస్సులు మొత్తం 20 బస్సులు నడిపినట్లు డీఎం పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా 7వ వేల మందికిపైగా ప్రయాణికులకు సేవలు అందించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లకుడీఎం ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న నిరసన

ప్రొద్దుటూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో భాగంగా గురువారం 17వ రోజు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, గ్యాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, రాజీ, సునీత, నిర్మల, పద్మ, కృష్ణవేణి, విజయ, గురుదేవి, శివమ్మ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : అంగన్‌వాడీ వర్కర్లు గురువారం మండల కార్యాలయం ఎదుట వివిధ భంగిమలల్లో నిరసన తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని ఇందుకు ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

జమ్మలమడుగు : పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న ఆరోన్ క్లినిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డీఎంఎస్ రాజు తెలిపారు. గురువారం స్థానిక క్లీనిక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూల్‌కు చెందిన కిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరానికి మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ కె.నవీన్‌కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ టి.నాగేంద్రప్రసాద్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఉచితంగా బీపీ, షుగర్ టెస్టులతో పాటు ఈసీజీ 2డి ఎకోలు చేస్తారన్నారు.

మన ప్రభుత్వంలో విద్యకు మహర్దశ

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మా ప్రభుత్వ హయాంలోనే కొత్తపేట గ్రామానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంజూరైందని.. ఈ ప్రభుత్వంలో విద్యకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహాయంతో రూ.15లక్షలు వెచ్చించి నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఉండేదని, దశల వారీగా ఉన్నత పాఠశాలగా మార్పు చెందిందన్నారు. గ్రామస్తులు అడిగిన మేరకు తాను విద్యాశాఖాధికారులతో మాట్లాడి ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేశామన్నారు. సమాజ అభివృద్ధికి విద్యే ముఖ్యమని గుర్తించిన ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా ఉండేవని, సీఎం జగన్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుద్దేటి జయరామిరెడ్డి రూ.4లక్షలు, పోరెడ్డి సుజాత ఫౌండేషన్ తరపున పోరెడ్డి నరసింహారెడ్డి రూ.3లక్షలు, రామిరెడ్డి గంగిరెడ్డి రూ.2లక్షలు ఇవ్వడంతోపాటు పలువురు సహాయం అందించారన్నారు. గుద్దేటి జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి ఆత్మకూరు సుధాకర్‌రెడ్డి, బయపురెడ్డి సోమశేఖర్ రెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్

కొత్తపేట గ్రామంలో గుద్దేటి జయరామిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి నాయకులతో కలిసి ప్రారంభించారు.

దేశ ప్రగతిలో మహిళ భాగస్వామ్యం



మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు స్వర్ణలత

మైదుకూరు : దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం ఎంతో ఉందని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు స్వర్ణకుమారి అన్నారు. మండల విద్యాశాధికారి కార్యాలయంలో గురువారం 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అంశంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అధ్యాపకురాలు స్వర్ణ కుమారి మాట్లాడుతూ భారత దేశంలో స్త్రీకి విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. ఆడ పిల్లలను చదివించి వారిని సమాజంలో ఎదిగేలా చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే దేశం ప్రగతి బాటలో నడుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సేవ్ ది గర్ల్ చైల్డ్ అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంఈఓ-2 నరహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలు వీరే

వ్యాసరచన పోటీల్లో మైదుకూరు బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కేపీఎస్ ధనలక్ష్మి రాయల్ మొదటి బహుమతి, వనిపెంట జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ఎం.అశ్విత రెండో బహుమతి, మైదుకూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎం.రామాంజనేయులు నాయక్ మూడో బహుమతిని గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీల్లో వనిపెంట జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం.హిమప్రియ మొదటి బహుమతి, మైదుకూరు బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.అక్షయ రెండో బహుమతి, వనిపెంట జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి సి.కార్తీక్ మూడో బహుమతిని గెలుచుకున్నారు. చిత్రలేఖనం పోటీల్లో మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్ పదో తరగతి విద్యార్థి టి.నాగేంద్ర మొదటి బహుమతి, వనిపెంట జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని సాత్విక రెండో బహుమతి, మైదుకూరు బాలశివ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎం.పూజిత మూడో బహుమతి అందుకున్నారు. వీరు త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ-2 నరహరి శర్మ తెలిపారు.

ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు

ప్రొద్దుటూరు : ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం సంక్రాంతి పండుగ లోపు చెల్లించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు, రాష్ట్ర కార్యదర్శి జీవీ నరసయ్య తెలిపారు. గురువారం స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎంప్లాయిస్ యూనియన్ కడప జిల్లా రీజియన్ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ 2020లో ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుంచి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. అలాగే విలీనం అయిన తర్వాత చనిపోయిన, రిటైర్డు అయిన, వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసినా మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ఈ ఏడాది సెప్టెంబర్‌లోపు బకాయిలను చెల్లిస్తామన్న హామీ మేరకు వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారి మెడికల్ బిల్లులను పెండింగ్ లేకుండా ఆమోదించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, కడప జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్, కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు బోస్ బాబు, కార్యదర్శి రామమూర్తి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17వ రోజు నిరసన

చాపాడు : సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన నిరసన కార్యక్రమాలు 17వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్వాడీ వర్కర్లు వినూత్న రీతిలో పోస్టు కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

అభాగ్యుడికి అంత్యక్రియలు

కాశినాయన : మండలంలోని ఓబులాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో ఉన్న అనాథ గురయ్య (70) గురువారం మృతి చెందాడు. మూడేళ్ల క్రితం గురయ్య తన బిడ్డలు ఆదరించడం లేదని వివేకానంద సేవాశ్రమానికి వచ్చాడు. ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామతులసి ఆయనకు ఆశ్రయం కల్పించారు. సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మనోజ్, సంస్థ ప్రతినిధులు పీరారెడ్డి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. సమ్మెకు జనసేన నాయలు జిలాన్ బాషా, లక్ష్మణ్ సింగ్, ప్రసాద్ మద్దతు తెలిపారు. యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు ఆహ్వానం



ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం: రాజమహేంద్రవరంలో జరగనున్న 2వ ప్రపంచ తెలుగు మహా సభలకు హాజరు కావాలని గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, బ్రహ్మంగారిమఠం ఎంపీపీ వీరనారాయణ రెడ్డిలకు ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా ముఖ్య సంచాలకులు బొల్లు రామమోహన్ ఆహ్వాన పత్రాలు అందజేశారు. మహాసభలకు తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే తెలియజేశారు.

ఆర్గానిక్ రిలాక్స్ కేఫ్ ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలోని బ్రహ్మంసాగర్ వెళ్లే దారిలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనిట్ మిల్లేట్ మాల్ట్, రిలాక్స్ కేఫ్‌ను గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఆర్గానిక్ మెటీరియల్‌తో చేసిన రాగి మాల్ట్, టీ, కాఫీలను వినియోగించటం వలన ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ వీరనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పన నాగార్జున, దీప్తి రమణారెడ్డి, సుబ్బరామిరెడ్డి, జోగయ్య, మాధవనాయుడు, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.5లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రాచమల్లు రమాదేవి

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీలోని కొట్టాల గ్రామంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత నిధులు రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. గురువారం సాయంత్రం ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు మాట ఇచ్చాడంటే మరచిపోడని తెలిపారు. ఈ గ్రామంలోని శివాలయం, రామాలయాల నిర్మాణాల్లో తాము భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జగనన్న ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతులతోపాటు రోడ్లు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. ముందుగా రమాదేవిని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టాల రంగారెడ్డి సన్మానించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల వెనుక వైపు నూతనంగా వేసిన సిమెంటు రోడ్డును, త్వరలో ఏర్పాటు చేయబోయే మినరల్ వాటర్ ప్లాంట్ షెడ్‌ను ఆమె పరిశీలించారు. ఎంపీపీ సలోమి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతమ్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బలరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెలవలి శేఖర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధిలో రైతులకు ఉపయోగపడే పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ నాగరత్నమ్మ

రాజుపాళెం : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ ఆ పథకం సిబ్బందికి సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం 2022-23 ఏడాదికి గాను ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగరత్నమ్మ మాట్లాడుతూ పనుల నిర్వహణ, రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని, ఈ పథకం పనుల్లో ఎక్కడా అవకతవకలు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కూలీలకు పనులు కల్పించడం, సచివాలయాలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం తదితర 810 పనులకు రాజుపాళెం మండలంలో రూ.5.23 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇందులో రూ.3,271 మొత్తాన్ని రికవరీ చేసినట్లు ఏపీడీ తెలిపారు. ముందుగా పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ వివరాలను తెలియజేశారు. జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఏపీడీ ఆనంద్, పీఆర్ ఏఈ శివరామయ్య, ఏపీఓలు గంగయ్య, లక్ష్మీనారాయణ, సామాజిక తనిఖీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి జరగాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

మైదుకూరు : జిల్లాలో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. మైదుకూరులో గురువారం సీపీఐ నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో అపార ఖనిజ సంపద, మానవ వనరులు ఉన్నాయని తెలిపారు. దీని వల్ల ఉద్యోగ అవకాశాలు పెరగాలని, కడప ఉక్కు పరిశ్రమతో పాటు మూతపడిన పరిశ్రమల పునరుద్ధరణ జరగాలని అన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం జరిగి సమగ్రాభివృద్ధి జరగాలని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, బషిరున్నీసా, వెంకట శివ, చంద్రశేఖర్, మైదుకూరు నియోజకవర్గ నాయకులు పి.శ్రీరాములు, ఏవీ శివరామ్, పి.భాస్కర్, పల్లవోలు రమణ, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..

చలిపులి పంజా విసురుతోంది. దీనికితోడు నాలుగైదు రోజులుగా పొగ మంచు దుప్పటిలా నిండుగా పరచుకుంటోంది. ఉదయం 8.30 దాటినా భానుడి కిరణాలు నేలపై పడ్డం లేదు. ఓ వైపు వాహనదారులు లైట్లు వేసుకుని వెళుతుండగా..మరో వైపు కర్షకులు ఇబ్బందులు పడుతూనే వ్యవసాయ పొలాల్లోకి వెళుతున్నారు. జనజీవనానికి పొగ మంచు ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ ప్రకృతి ప్రియులకు పొగ మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇదే క్రమంలో ఆరుతడి పంటలపై బుడ్డశనగ, మినుము, జొన్న వంటి పంటలకు మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు. అడుదాం ఆంధ్రా క్రీడల కోసం పొగ మంచును సైతం లెక్క చేయకుండా యువత తెలవారుజామునే క్రికెట్ ప్రాక్టీసు చేసుకుంటుండడం విశేషం.

–చాపాడు



పంట పొలాల్లో కురుస్తున్న పొగమంచు



చాపాడులో వేకువజామునే క్రికెట్ ప్రాక్టీసు చేస్తున్న యువకులు

కడప రాయుడికి పునర్వసు పూజలు



గంధ లేపనం అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం పునర్వసు పూజలను నిర్వహించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి పుణ్యాహవాచనంతో శుద్ధి చేశారు. అనంతరం పరిమళ ద్రవ్యాలు, పూలతో దేవతామూర్తులకు అలంకారం నిర్వహించారు.

ఆకర్షణీయ చిత్రాలు గీయాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళల విభాగాధిపతి డాక్టర్ కె. మృత్యుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జీవన సంప్రదాయాలు' మ్యూరల్ పెయింటింగ్‌పై ఐదురోజుల వర్క్‌షాప్‌ను వీసీ ఆచార్య చింతా సుధాకర్ సందర్శించారు. రెండోరోజు గురువారం ఆయన ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి విద్యార్థులు గీచిన చిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ బ్లాక్ అంతర్గత గోడలపై గీస్తున్న చిత్రాలు అర్థవంతంగాను, ఆకర్షణీయంగాను, చూపరులను ఆలోచింపజేసేవిగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్ సంచాలకులు డాక్టర్ కోట మృత్యుంజయరావు వర్క్‌షాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌లు పి. సంతోష్ కుమార్, కె. రవి, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్ తదితరులు